గుట్టలో సుదర్శన నారసింహ హోమం

స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం జరపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 9 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మంగళవారం ఉదయం నిత్య సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. స్వామి, అమ్మవార్లకు నిత్యారాధనలు శాస్త్రోక్తంగా జరిగాయి. శివాలయం చెంతన గల క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజను ఘనంగా నిర్వహించారు. సుమారు 10వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆలయ ఖజానాకు రూ.16,33,735 ఆదాయం సమకూరినట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం..

యాదగిరిగుట్ట అనుబంధ ఆలయమైన పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వసంత నవరాత్రి ఉత్సవాలకు అర్చకులు, పురోహితులు అంకురార్పణ చేశారు. మొదటిరోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశనం, అఖండ దీపారాధన నిర్వహించారు. సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవంలో భాగంగా 16న ఎదుర్కోలు మహోత్సవం, 17న రాములోరి కల్యాణోత్సవం, 18న శ్రీరామపట్టాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, డీఈఓ దోర్బాల భాస్కర్, ఏఈఓ కృష్ణ, పర్యవేక్షకుడు చంద్రమౌళి పాల్గొన్నారు.

వరి ధాన్యాన్ని ఏ-గ్రేడ్‌గా కొనుగోలు చేయాలి

● రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రారెడ్డి

జిబ్లక్‌పల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 9 : మండల వ్యాప్తంగా పండించిన వరి పంటను ఏ-గ్రేడ్‌గా కొనుగోలు చేయాలని, లేకుంటే ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జిబ్లక్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 90 శాతం మూసీ నీటితోనే వరి పండుతుందని, రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మండల రైతులు పండించిన వరిని బి-గ్రేడ్‌గా పరిగణించి రైతులను ప్రభుత్వం దోపిడీ చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు మండలంలోని ధాన్యాన్ని ఏ-గ్రేడ్‌గా కొనుగోలు చేయాలని, అలాగే క్వింటాకు రూ.500 బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు పగిళ్ల లింగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి విష్ణు, సీఐటీయూ మండల కన్వీనర్ మధు, రైతులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ కానుకల పంపిణీ



ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ముద్దసాని కిరణ్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, ఏప్రిల్ 9 : రంజాన్ పర్వదినం పురస్కరించుకొని మండలంలోని మొగిలిపాకలో 60 ముస్లిం కుటుంబాలకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో రంజాన్ పండుగ జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి, సత్తయ్య, శంకరయ్య, నర్సింహ, విష్ణుచారి, ఇంద్రారెడ్డి, సత్యరాములు, సయ్యద్ మౌలానా, కాశీం పాల్గొన్నారు.

పండుగపూట విషాదం

మామిడి చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 9 : పండుగ పూట మంగళవారం ఓ ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. మామిడిచెట్టు పైనుంచి కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన యాదగిరిగుట్ట పట్టణంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆత్మకూరు(ఎం) మండలంలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన యాట పాండు(38) పట్టణంలో కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పండుగ కావడంతో మామిడాకుల కోసం చెట్టు ఎక్కి ఆకులు తెంపుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి మృత్యువాత పడ్డాడు.

మృతుడికి ఇద్దరు కూతుళ్లున్నారు. ఆరేళ్ల క్రితం అతని భార్య మృతి చెందగా ఇద్దరు అమ్మాయిలు అనాథలుగా మారారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వికసించిన ఏప్రిల్ పుష్పాలు

మండు వేసవిలో ఏప్రిల్ పుష్పాలు విరబూశాయి. ఆత్మకూర్.ఎం మండలం కొరటికల్‌లోని గాడిపల్లి శోభ ఇంట్లో మంగళవారం ఏప్రిల్ పుష్పాలు వికసించాయి. మంచి సువాసన వెదజల్లడంతో పాటు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

-ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 9

ఘనంగా ఉగాది వేడుకలు

జిల్లా వ్యాప్తంగా మంగళ వారం క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ప్రజలంతా వేకువజామునే లేచి ఇండ్లకు మామిడి తోరణాలు కట్టి ఉగాది పచ్చడి తయారు చేసి సేవించారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. పలు గ్రామాల్లో గౌడ కులస్తులు కాటమయ్య, ఎల్లమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయాలు, ప్రధాన సెంటర్లలో పండితులు పంచాంగ పఠనం గావించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఆదాయం, వ్యయం, రాజ్యపూజ్యం గురించి తెలుసుకున్నారు.

-నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 9

యాదగిరిగుట్ట : పంచాంగ పఠనం చేస్తున్న యాదగిరిగుట్ట ఆలయ ఆస్థాన సిద్ధాంతి శ్రీమాన్ నల్లాన్‌చక్రవర్తుల కృష్ణామాచార్యులు

భువనగిరి కలెక్టరేట్ : రమణేశ్వరంలో భక్తులతో కలిసి ఉగాది వేడుకల్లో పాల్గొన్న సిద్ధగురు రమణానంద మహర్షి

రాజాపేట : సోమారం గ్రామంలో ఉగాది పచ్చడి తయారు చేస్తున్న యువతులు

ఆలేరు రూరల్ : కొలనుపాకలో కాటమయ్యకు బోనాలు తీసుకొస్తున్న భక్తులు

ఆత్మకూరు(ఎం) : కంఠమహేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆలేరు రూరల్ : కొలనుపాకలో కాటమయ్య, రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న గౌడ కులస్తులు

ఆత్మకూరు(ఎం) : బీరప్ప దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చౌటుప్పల్ : బాలాజీ రామకృష్ణ ఆలయంలో ఉగాది వేడుకలు

వలిగొండ : మత్స్యాద్రిపై పంచాంగ పఠనం చేస్తున్న వేదపండితుడు

భూదాన్‌పోచంపల్లి : పంచాంగ పఠనం చేస్తున్న పురోహితుడు

ఆత్మకూరు(ఎం) : శివాలయంలో పంచాగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు

భువనగిరి కలెక్టరేట్ : రాయగిరిలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

మోత్కూరు : పంచాంగ పఠనం చేస్తున్న పురోహితుడు

చౌటుప్పల్ : పంచాగ శ్రవణంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజు

మోటకొండూర్ : బీరప్ప దేవాలయం వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

మోత్కూరులో వినూత్నంగా ఉగాది సంబురాలు

ముత్యాలమ్మకు బోనాలు.. ఎండ్లబండ్ల ప్రదర్శన

మోత్కూరులో ఎడ్లబండ్లు, వాహనాల ప్రదర్శన

ముత్యాలమ్మకు బోనాలు తీసుకొస్తున్న మహిళలు

మోత్కూరు, ఏప్రిల్ 9 : తెలుగు నూతన సంవత్సరం ఉగాది సంబురాలను మోత్కూరులో వైభవంగా, వినూత్నంగా జరుపుకొన్నారు. గ్రామంలోని ప్రజలంతా కుల, మతాలకతీతంగా బోనాలు, ఎండ్లబండ్లతో మంగళవారం క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలికారు. పూర్వం నుంచి ఆనవాయితీగా జరుపుకొంటున్న విధంగా ఎడ్లబండ్లను అలంకరించి వేప, మామిడి తోరణాలు కట్టి పసుపు, కుంకుమలతో పుజించారు. మధ్యాహ్నం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. యువకులు బైక్ విన్యాసాలు చేశారు. గ్రామస్తులు చెరువు కట్ట వద్ద కొలువైన ముత్యాలమ్మకు, సుందరయ్య కాలనీలో పడమటి ముత్యాలమ్మకు, కొండాపురం గ్రామంలోని ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. అమ్మవారికి బోనాలతోపాటు కల్లు, మజ్జిగ, బెల్లం, చక్కెర పానీయాలు సాక పోశారు. ఆలయాల చుట్టూ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, కార్లు, మోటారు సైకిళ్ల ప్రదర్శనలు చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు బోనాల ఊరేగింపు జరిగింది. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

మృతి చెందిన గొర్రెలు

బీబీనగర్, ఏప్రిల్ 9 : మండలంలోని గూడూరుకు చెందిన చంద్రయ్య వృత్తి రీత్యా గొర్రెల కాపరి. రోజు మాదిరిగానే సోమవారం గొర్రెలను మేపుకొచ్చి సాయంత్రం దొడ్డిలో తోలి ఇంటికి వెళ్లాడు. రాత్రి ఎవరూ లేని సమయంలో గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేసి 10 గొర్రెలు, 15 పిల్లలను చంపేశాయి. వాటి విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఘటనా స్థలాన్ని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండలాధ్యక్షుడు సోము రమేశ్ పరిశీలించారు. ప్రభుత్వం బాధితుడిని ఆదుకోవాలని కోరారు.

జగత్‌పల్లిలో బైక్ చోరీ

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 9 : గుర్తుతెలియని దుండగులు బైక్‌ను చోరీ చేసిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జగత్‌పల్లికి చెందిన మాజీ సర్పంచ్ నోముల ఎల్లారెడ్డి తన బైక్‌ను సోమవారం మధ్యాహ్నం ఇంటి ముందు పార్క్ చేశాడు. గ్రామపంచాయతీ దగ్గర వాటర్ ట్యాంక్ పని ఉండడంతో బైక్‌కు తాళం వేయకుండానే వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. దాంతో చోరీకి గురైనట్లు గుర్తించి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

పుస్తెలతాడు అపహరణ

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 9 : ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడ నుంచి బంగారు పుస్తెలతాడును అపహరించుకుపోయిన సంఘటన మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఏంబావి వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జక్క నిర్మల కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగుడు రాత్రి 2 గంటల ప్రాంతంలో ఇంట్లో చొరబడి నిర్మల మెడలో ఉన్న 5 తులాల పుస్తెలతాడును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.